# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-02-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థిక వృద్ధికి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదం చేస్తుందని కేంద్ర పెట్రోలియం శాఖా మంత్రి హర్ దీప్ సింగ్ పూరీ పేర్కొన్నారు.
- ❖ తెలుగు భాషా వికాసానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు.
- ❖ రాష్ట్రంలో క్వింటాల్ మిర్చికి 11 వేల 600 రూపాయలు పైగా మద్దతు ధర ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.
- ❖ ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన ఆప్కో, కో ఆప్టెక్స్ ఏజెన్సీలు తమ షోరూమ్ ల్లో రెండు రాష్ట్రాల చేనేత వస్త్రాలు విక్రయించుకునేలా ఒప్పందం కుదురింది.
- ❖ రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా అధికారులను ఆదేశించారు.

=======================

కేంద్ర బడ్జెట్ దేశ ఆర్థికవృద్ధికి, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి దోహదం చేసేలా ఉందని కేంద్ర పెట్రలియం శాఖా మంత్రి హర్ దీప్ సింగ్ పూరీ అన్నారు. ఈ రోజు విజయవాడలో కేంద్రబడ్జెట్ - 2025-26పై నిర్వహించిన మేధావుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ… కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. బడ్జెట్ లో రాష్ట్రానికి ఎంతో ప్రాధాన్యం కల్పించామని కేంద్ర మంత్రి వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

=======================

ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన ఆప్కో, కో ఆప్టెక్స్ ఏజెన్సీలు తమ షోరూమ్ ల్లో రెండు రాష్ట్రాల చేనేత వస్త్రాలు విక్రయించుకునేలా ఒప్పందం కుదురింది. ఈ రోజు విజయవాడలో జరిగిన ఈ కార్యక్రమంలో రెండు రాష్ట్రాల చేనేత, జౌళి శాఖల మంత్రులు ఎస్.సవిత, ఆర్.గాంధీ సమక్షంలో ఆప్కో, కో ఆప్టెక్స్ మధ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సంవత్సరం 9.20 కోట్ల రూపాయల మేర వస్త్రాలు విక్రయాలు చేయాలని ఆప్కో, కో ఆప్టెక్స్ నిర్ణయించాయి. ఈ ఒప్పందంలో భాగంగా తమిళనాడుకు చెందిన చేనేత వస్త్రాలను ఆప్కో సహా ఇతర వ్యాపార సంస్థల్లో విక్రయిస్తారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన చేనేత వస్త్రాలను కో ఆప్టెక్స్ షోరూమ్ లతో పాటు తమిళనాడు వ్యాప్తంగా ఉన్న పలు వస్త్ర దుకాణాల్లో విక్రయించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి ఎస్.సవిత మాట్లాడుతూ... ఈ ఒప్పందంతో రాష్ట్రానికి చెందిన చేనేత కార్మికులకు ఎంతో లబ్ధి కలుగనుందని, చేనేత ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం లభిస్తుందని తెలిపారు.

======================

తెలుగు భాషా వికాసానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులోని ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. తెలుగు భాషను ప్రేమిస్తూ.. పెంచి పోషించాల్సిన బాధ్యత అందరికీ ఉందన్నారు. అధ్యాపకులు తెలుగుభాష ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించి భాషాభివృద్ధికి కృషి చేయాలని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 29 సెకన్లు)

======================

రాజీవ్ గాంధీ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయం ఆర్జీయూకేటీ నూజివీడు ప్రాంగణం విద్యార్థులకు ప్రత్యేకంగా వాట్సాప్ గవర్నెన్స్ ప్రారంభించినట్లు ప్రాంగణ డైరెక్టర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర తెలిపారు. ఈ రోజు ఆయన పలువురు అధికారులతో కలసి భోజనశాల, వంటశాలను పరిశీలించారు. విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... విద్యార్థుల సౌలభ్యం కోసం వాట్సాప్ గవర్నెన్స్ అందుబాటులోకి తెచ్చామని, ఈ ప్రక్రియ ద్వారా వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించగలుగుతామని పేర్కొన్నారు.

======================

ప్రకాశం జిల్లాలో ఈ నెల 23వ తేదీన నిర్వహించనున్న గ్రూప్ 2 మెయిన్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ తో కలిసి ఆమె పాత్రికేయులతో మాట్లాడారు. జిల్లాలో 7 కేంద్రాల్లో 4 వేల 544 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోనికి ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను,సెల్ ఫోన్లను అనుమతించరని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ... పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేస్తున్నామ ని, 144వ సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

విరామం

======================

ఆంధ్రప్రదేశ్ లో క్వింటాల్ మిర్చికి 11 వేల 600 రూపాయలు పైగా మద్దతు ధర ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్రమంత్రితో పాటు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ఈ రోజు సమావేశమయ్యారు. అనంతరం రామ్మోహన్ నాయుడు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని మిర్చి రైతులను ఆదుకోవాలని కేంద్రాన్ని కోరామని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తితో మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి చర్యలు చేపతున్నారని వివరించారు. మిర్చి ఎగుమతులు, ఆంధ్రప్రదేశ్ మిర్చికి అంతర్జాతీయ మార్కెట్ కల్పించే అంశంపై

సమావేశంలో చర్చించామని తెలిపారు. రాయలసీమ, గుంటూరు, పల్నాడు జిల్లాల మిర్చి రైతులకు లబ్ధి కలిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని రామ్మోహన్ నాయడు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=======================

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్ సిసోడియా అధికారులను ఆదేశించారు. నెల్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఆయన జిల్లాలోని రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చే అర్జీల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు సకాలంలో అందించాలని, చుక్కల భూముల విషయంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. రెవెన్యూ రికార్డులన్నీ డిజిటలైజేషన్ చేయాలని దిశా నిర్దేశం చేశారు.

=======================

జిల్లాలోని అన్ని గ్రామాలకు అంతరాయం లేకుండా తాగు నీటి సరఫరా చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ఆదేశించారు. ఈ రోజు నరసరావుపేటలో కలెక్టర్ కార్యాలయంలోని వ్యవసాయ, ఉద్యానవన, గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... తాగు నీటి సరఫరాకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నీటి వృధా కాకుండా, చెరువులకు గండ్లు పడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, సాగు నీటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

=======================

శ్రీశైలం పుణ్య క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా మూడోరోజైన ఈ రోజు స్వామి అమ్మవార్లు హంసవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో శ్రీస్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా సాయంత్రం విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్ల దేవస్థానం తరపున అధికారులు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. రాత్రి శ్రీస్వామి అమ్మవారికి వైభవంగా గ్రామోత్సవం నిర్వహిస్తారు.

=======================

రైతులకు ఆమోదయోగ్యమైన భూ రీ సర్వే చేపట్టేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ రోజు పాలకోడేరు మండలం శృంగ వృక్షంలో భూ రీ సర్వేలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్న కలెక్టర్ రైతుల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ... రైతుల సమక్షంలోనే భూ రీ సర్వే నిర్వహించి వాస్తవ రికార్డులను రూపొందించడమే లక్ష్యమని అన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 20 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీసర్వే నిర్వహిస్తున్నామని, 37 వేల ఎకరాలు సర్వే చేయవలసి ఉండగా, ఇప్పటివరకు 22 వేలు ఎకరాలు సర్వే పూర్తి అయ్యిందని కలెక్టర్ తెలిపారు.

=======================
=======================